WANTED
జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.
తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.
సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhinews
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
సంపుటి:1
సంచిక:86
సోమవారం,
02.12.2024

# తెలంగాణలో భారీ ఎన్‌కౌంటర్

"మావోయిస్టులకు షాక్ తగిలింది. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం ఏజెన్సీ అడవుల్లో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. చల్పాక అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో నర్సంపేట ఏరియా కమాండర్ భద్రుతో పాటు ఏడుగురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో రెండు ఏకే 47 రైఫిల్స్ తో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

- ఏడుగురు మావోయిస్టులు మృతి
- ఒక్కసారిగా ఉలిక్కపడ్డ మన్యం ప్రాంతం
- ఇది ఫేక్ ఎన్‌కౌంటర్
- ఏడాది పండుగ చేసుకుంటూ ఇలాంటి దారుణాలా
- సర్కారుపై మండిపడ్డ ప్రజా సంఘాల నేతలు
- బూటకలు ఎన్‌కౌంటర్: హరీశ్‌రావు

వారధి, స్టేట్ బ్యూరో:
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కనుమరుగైన మావోయిస్టులు మళ్లీ తెలంగాణలో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. గడచిన పదేళ్లలో ఒకటిరెండు సంఘటనలు తప్ప మావోయిస్టుల కదలికలు అంతగా లేవు. అలాంటిది ఆదివారం ఉదయం ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌తో తెలంగాణ ఒక్కసారి ఉలిక్కిపడింది. ఇదే ములుగు జిల్లాలో వారం రోజుల క్రితం ఇద్దరు ఆదివాసీలను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసిన సంగతి తెలిసిందే. దీంతో గ్రేహౌండ్స్ బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలోనే తాజా ఎన్ కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ హతమైనట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతిచెందిన మావోయిస్టుల వివరాలను పోలీసులు వెల్లడించారు. టీఎస్‌సీఎం ఇల్లందు-నర్సంపేట సెక్రటరీ కుర్సం మంగు భద్రు అలియాస్ పాపన్న, ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ డీవీసీఎం కార్యదర్శి ఏగోలపు మల్లయ్య



అలియాస్ మధు, ఏసీఎం ముస్సాకి దేవల్ అలియాస్ కరుణాకర్, ఏసీఎం ముస్సాకి జమున, పార్టీ సభ్యులు జైసింగ్, కిషోర్, కామేశ్‌లు పోలీసులు వెల్లడించారు. అయితే ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ ప్రజాసంఘాల నేతలు మండిపడుతున్నారు.

..మిగతా 2 లో

## రైతులకు డబుల్ ధమాకా..

- సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు
- అసెంబ్లీ సమావేశాల్లో విధివిధానాల ఖరారు
- బీఆర్ఎస్, బీజేపీ మారీచుల మాటలు నమ్మొద్దు
- సన్న వడ్లకు రూ.500 బోనస్ కొనసాగిస్తాం
- పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పు రూ.7 లక్షల కోట్లు
- నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ కడుతున్నాం
- కిషన్ రెడ్డి గుజరాత్ గులాం
- మోడీ హామీలు, కాంగ్రెస్ హామీలపై చర్చిద్దా రండి
- ప్రతిపక్షాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం



వారధి, స్టేట్ బ్యూరో:
తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసాపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. అన్నదాతల ఖాతాల్లోకి డబ్బులు వేసేదెప్పుడో స్పష్టం చేశారు. ఆదివారం నాడు తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుభరోసాపై కీలక ప్రకటన చేశారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని తెలిపారు. "మా ప్రభుత్వం రైతు భరోసా

..మిగతా 2 లో

## రేవంత్‌ది బేకార్ సర్కార్

- ఇది నేను అన్నది కాదు ప్రజలు అంటున్నరు
- సీఎంకు సంపద పెంచే సత్తా లేదు
- ఏడాది పాలనలో సర్వం నాశనం
- అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ఎక్కడు కూర్చుందామన్న చర్చకు నేను రెడీ
- సీఎంపై మాజీ మంత్రి హరీష్‌రావు ఆగ్రహం



వారధి, స్టేట్ బ్యూరో:
'కాంగ్రెస్ సర్కార్.. ఉత్త బేకార్' అని తెలంగాణ ప్రజలంతా తిట్టిపోస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. "మాది సుపరిపాలన అంటూ నీకు నువ్వే డబ్బా కొట్టుకోవడం కాదు రేవంత్‌రెడ్డీ.. జనం ఏమనుకుంటున్నారో తెలుసుకో! నీ అపరిపక్వత, అసమర్థతతో రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొంది. ఎవరూ మెచ్చుకునే పరిస్థితిలేదు" అని మండిపడ్డారు. ఆర్థికవృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే,

..మిగతా 2 లో



## దేశవ్యాప్తంగా జియో నెట్‌వర్క్ డౌన్..

- సోషల్ మీడియాలో నెటిజన్ల ఆగ్రహం
- స్పందించని జియో అధికారులు

2 లో



## అసెంబ్లీకి వేళాయె..

- 9 నుంచి శీతాకాల సమావేశాలు
- రైతుభరోసా, కులగణనపై చర్చ
- సర్కారును నిలదీసేందుకు సిద్ధమైన ప్రతిపక్షాలు

2 లో



## 6 అబద్ధాలు.. 66 మోసాలు..

రేవంత్ సర్కార్ పై బీజేపీ చార్జిషీట్ రిలీజ్ చేసింది. ఏడాది పాలనలో రూ. 80వేల కోట్ల అప్పు చేశారంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. 6 అబద్ధాలతో మొదలైన అరాచక హస్తం పాలన 66 మోసాలతో అందరినీ వంచించిందన్నారు. ఈ మేరకు 'కాంగ్రెస్ గ్యారంటీల గారడీ 6 అబద్ధాలు.. 66 మోసాలు' పేరుతో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీజేపీ నేతలతో కలిసి కిషన్ రెడ్డి ఈ చార్జిషీట్ విడుదల చేశారు.

- ఏడాదిలో రూ.80వేల కోట్ల అప్పులు
- రాష్ట్రంలో ఆడబిడ్డల ఆక్రందనలు
- అన్నదాతలకు ఉరితాళ్లు
- పసిబిడ్డల అన్నంల పురుగులు
- నిరుద్యోగుల చేతికి సంకెళ్లు
- ఉద్యోగులకు ఊకదంపుడు ముచ్చట్లు
- వృద్ధులకు అందని ఫించన్లు
- రేవంత్ సర్కార్ పై బీజేపీ చార్జిషీట్

వారధి, స్టేట్ బ్యూరో:
ఈ మేరకు కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పదేళ్ల పాటు నియంతృత్వపాలన కుటుంబపాలన అవినీతి పాలన సాగిస్తే అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 6 గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని స్వయంగా సోనియా గాంధీ కరపత్రాల రూపంలో ఇంటింటికి చేర్చారు. కానీ ఈ ఏడాది కాలంలో మీరిచ్చిన హామీలు ఏవీ కూడా అమలు కాలేదు. డిసెంబర్ 7న అధికారంలోకి వస్తాను, డిసెంబర్ 9వ తేదీన రైతుల రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి గతేడాది ఎన్నికలకు ముందు ఊరూరా ప్రజలను నమ్మించారు. కానీ

..మిగతా 3 లో



## తెలంగాణపై ఫెంగల్ ఎఫెక్ట్

- మూడు రోజులు తేలికపాటి వానలు
- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

..మిగతా 2 లో

## మందుబాబులకు అడ్డాగా క్రీడా ప్రాంగణాలు

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో బోర్డులకే పరిమితం
- పిచ్చిమొక్కలతో నిండిపోయిన మైదానాలు
- పట్టించుకునే నాథుడు ఎక్కడ..?
- తీవ్ర నిరాశకు గురవుతున్న క్రీడాకారులు

వారధి, స్టేట్ బ్యూరో:
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రీడాప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. వాటిని పట్టించుకునే నాదుడే లేక మందుబాబులకు అడ్డాగా మారాయి. మద్యం సేవించి అక్కడే బాటిళ్లను పడేయడంతో సీసాల డంప్ గా దర్శనమిస్తున్నాయి. నిర్వహణ లేక పోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. సరైన వసతులు, నిర్వాహణ లేక.. క్రీడాకారులు రాక ప్రాంగణాలు వెలవెలబోతున్నాయి. కొన్ని జిల్లాలో క్రీడా మైదనాల కోసం ఏర్పాటు చేసిన స్థలాల్లో రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు.



కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలుగా వినియోగించు కుంటున్నారు. కల్లాల నిర్మాణాలు

2 లో



## కౌన్ బనేగా మహారాష్ట్ర సీఎం..?

- నేడు అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- ముంబైలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం
- డోంట్ వర్రీ అంటున్న సీఎం షిండే

2 లో

2
సోమవారం,
02.12.2024
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




# తెలంగాణలో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ

**బూటకపు ఎన్‌కౌంటర్: హరీశ్ రావు**

**ఏడాది విజయోత్సవాలు ప్రభుత్వం నిర్వహిస్తుంటే ఈ బూటకపు ఎన్ కౌంటర్ ఏంది? అని మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ సర్కార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. అరెస్టులు, నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు ఒకవైపు.. బూటకపు ఎన్‌కౌంట్లర్లు మరోవైపు రాష్ట్రంలో అశాంతిని రేపుతున్నాయని ఆరోపించారు. అన్ని వర్గాలను మోసం చేసి ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని, ఏడో గ్యారెంటీగా డబ్బా కొట్టిన ప్రజాస్వామ్య పాలనకు సైతం విజవంతంగా తూట్లు పొడిచారని విమర్శించారు. బూటకపు వాగ్దానాలు, బూటకపు ఎన్కౌంటర్లు అంటూ ఫైర్ అయ్యారు.**

# దేశవ్యాప్తంగా జియో నెట్‌వర్క్ డౌన్..

వారధి, నేషనల్ బ్యూరో:

దేశవ్యాప్తంగా రిలయన్స్ జియో సేవలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి చాలా ప్రాంతాల్లో జియో నెట్‌వర్క్ డౌన్ అయింది. దీంతో పెద్ద సంఖ్యలో విని యోగదారులు కాల్ డ్రాప్ సమస్యను ఎదుర్కొన్నారు. అలాగే తమ ఫోన్లలో ఇంటర్నెట్ స్లోగా వస్తోందని, కొన్ని వెబ్‌సైట్లు మొత్తానికే ఓపెన్ కావడం లేదని, సిగ్నల్స్ ఉన్న కాల్ కలవడం లేదని వాపోతున్నారు. ఇక కొందరు తమకు సుమారు నాలుగు గంటలుగా సర్వీస్ సరిగా లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కస్టమర్లు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. 'మీరు ఇండియాలో రీఛార్జి ప్లాన్‌ల ధరలను పెంచుతూనే ఉంటారు.. కానీ నెట్‌వర్క్, ఇంటర్నెట్ స్పీడ్ మాత్రం నిరంతరం తగ్గిపోతుంది. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించండి' అని జియోని ట్యాగ్ 'ఎక్స్(X)'లో పోస్ట్ చేస్తున్నారు. అయితే ఈ సమస్యపై జియో ఇంతవరకు అధికారికంగా స్పందించలేదు.

# అసెంబ్లీకి వేళాయె..

వారధి, స్టేట్ బ్యూరో:

అసెంబ్లీ సమరానికి సమయం ఆసన్నమైంది. ఈ నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా రైతు భరోసా విధివిధానాలు, కులగణన వివరాలపై చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోపక్క ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ భావిస్తోంది. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అటకెక్కించడంపై ఆ సెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది.

రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో చర్చిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఉదయం ఒక ప్రకటన చేశారు. కులగణన వివరాలపై కూడా ఈ సమావేశాల్లో చర్చ జరుగుతుందని చెప్పారు. వీటితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి పంచాయతీ రాజ్ బిల్లుకు సవరణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇద్దరు పిల్లలు కంటే ఎక్కువ ఉన్నా ఎన్నికల్లో పోటీ చేసేలా నిబంధనలు మార్చనున్నట్లు సమాచారం.

# కౌన్ బనేగా మహారాష్ట్ర సీఎం..?

**నేడు అభ్యర్థిని ప్రకటించే అవకాశం**

**ముంబైలో బీజేపీ శాసనసభాపక్ష సమావేశం**

**డోంట్ వర్రీ అంటున్న సీఎం షిండే**

వారధి, స్టేట్ బ్యూరో:

మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరో సోమవారం తేలిపోనుంది. బీజేపీ శాసనసభాపక్ష సమావేశం సోమవారం జరగనుండగా, అందులో నిర్ణయం తీసుకుంటారని ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే చెప్పారు. ఈనెల 5న సీఎం ప్రమాణ స్వీకారం జరుగుతుందన్న ఆయన మహాయుతి కూటమిలోని మూడు పార్టీలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తాయని పేర్కొన్నారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘన విజయం సాధించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ, బీజేపీ శాసనసభాపక్షం సోమవారం సమావేశం కానుంది. ఇప్పటికే బీజేపీ నాయకుడే సీఎం అవుతారని స్పష్టం కాగా, సోమవారం జరిగే శాసనసభాపక్ష భేటీలో బీజేపీ ఎమ్మెల్యేలు తమ నాయకుడ్ని ఎన్నుకోనున్నారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే చెప్పారు. శుక్రవారం తన స్వగ్రామానికి వెళ్లిన ఆయన, సుదీర్ఘ ఎన్నికల ప్రచారం కారణంగా అనారోగ్యానికి గురైనట్లు తెలిపారు. విశ్రాంతి తీసుకునేందుకే స్వగ్రామానికి వచ్చినట్లు వివరించిన శిందే, ప్రస్తుతం తన ఆరోగ్యం బాగానే ఉందన్నారు.

ప్రభుత్వ ఏర్పాటు తీరుపై అసంతృప్తితోనే స్వగ్రామానికి వెళ్లినట్లు వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు మహాయుతి కూటమికి ఘన విజయం అందించారన్న శిందే, ఇప్పుడు తమ బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు కూటమి పార్టీలు కృషి చేస్తాయని తెలిపారు.

ప్రమాణ స్వీకారం తేదీ, వేదిక ఖరారైనప్పటికీ సీఎం ఎవరో ఇంకా ప్రకటించలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి కదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు, 'సోమవారం బీజేపీ శాసనసభాపక్ష సమావేశం ఉంది. అందులో నిర్ణయం జరిగిపోతుంది. దాని గురించి మీరు ఎందుకు చింతిస్తున్నారు. ఐదో తేదీకి ఇంకా సమయం ఉంది కదా!' అని శిందే అన్నారు.

# రైతులకు డబుల్ ధమాకా..

మొదటిపేజీ తరువాయి

కొనసాగిస్తుంది.. సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేస్తాం.. బీఆర్ఎస్, బీజేపీలు మారీచులు మాదిరి వచ్చి చెప్పే మాటలు నమ్మకండి.. రైతు భరోసా ఆగదు.. రైతుభరోసా విధివిధానాలపై భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉప సంఘం వేశాం.. డిసెంబర్ నెలలో జరిగే శాసనసభ సమావేశాల్లో విధివిధానాలపై చర్చ పెడతాం.. విధివిధానాలను ఖరారు చేసి సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసాను వారి ఖాతాల్లో వేస్తామని రైతులకు నేను భరోసా ఇస్తున్నాను. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి, చేసి చూపించాం.. ఇప్పుడు రైతు భరోసాను అమలు చేసేందుకు కూడా మా ప్రభుత్వం కట్టుబడి ఉంది'' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

**25 లక్షల మందికి రుణమాఫీ**

ఆగస్టు 15 నాటికి 22.22 లక్షల మంది రైతులకు రుణాఫీ చేశామని.. వారి ఖాతాల్లోకి దాదాపు రూ. 18 వేల కోట్లను జమ చేశామని సీఎం రేవంత్ తెలిపారు. శనివారం నాడు కూడా 3.14 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 2,747 కోట్లు జమ చేశామని చెప్పారు.



ఇప్పటివరకు 25.35 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ సర్కార్ రెండోసారి ఐదేళ్లలో కూడా రుణమాఫీ పూర్తి చేయలేదని ఆరోపించారు. పదేళ్లలో బీఆర్ఎస్.. రాష్ట్రాన్ని అప్పులమయం చేసిందని చెప్పారు. అప్పులతో కేసీఆర్ రాష్ట్రాన్ని తమకు అప్పగించారని తెలిపారు. రూ.7 లక్షల కోట్ల అప్పు, నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ చెల్లించే దుస్థితికి తీసుకొచ్చారని చెప్పారు.

**బోనస్‌కొనసాగిస్తాం..**

సన్న వడ్లకు రూ.500 బోనస్ పైన సీఎం రేవంత్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుత సీజన్‌లో సన్నాలు పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని.. ఈ బోనస్ వచ్చే సీజన్‌కు కూడా కొనసాగిస్తామని రేవంత్ తెలిపారు. తెలంగాణలో పండిన బియ్యం.. రేషన్ షాపులలో ఇవ్వలనుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలలో విద్యార్థులకు తెలంగాణలో పండిన బియ్యమే పెట్టాలని భావిస్తున్నామని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రైతాంగం సన్నాలు పండించాలని సూచించారు. సన్న వరి రకానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామంటే.. బీఆర్ఎస్, బీజేపీలు అపోహాలు సృష్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గతంలో వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్టే అని మాట్లాడిన కేసీఆర్ పార్టీ.. తాము సన్నాలకు బోనస్ ఇస్తామంటే ఈరోజు అపోహాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రూ. 500 బోనస్ వచ్చే సీజన్‌లోనూ కొనసాగుతుందని తెలిపారు.

**కిషన్ రెడ్డి గుజరాత్ గులాం..**

కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ విడుదల చేసిన ఛార్జ్ షీట్ పై సీఎం రేవంత్ స్పందించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి.. తెలంగాణ గురించి ప్రశ్నించేందుకు ఏ హక్కు ఉందని.. ఆయన గుజరాత్ కు బానిస అని.. అందుకే గుజరాత్ వెళ్తున్నానని గతంలో కిషన్ రెడ్డి చెప్పారంటూ వ్యాఖ్యానించారు. గుజరాత్ లో మద్యపాన నిషేధం ఉందని చెబుతున్నారని.. అక్కడ ఏయే బ్రాండ్లు దొరుకుతున్నాయో బస్సు ఏర్పాటు చేస్తా వెళ్లి చూసొద్దామా? అని సవాల్ విసిరారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ గతంలో ఇచ్చిన హామీలపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని,, బీజేపీ నుంచి ఎవరు వస్తారో రావాలని.. మా మంత్రులు చర్చకు సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. 11 సంవత్సరాల మోడీ హామీలు.. 10 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ప్రత్యేక చర్చ పెడదామని పేర్కొన్నారు.

# రేవంత్‌ది బేకార్ సర్కార్

మొదటిపేజీ తరువాయి

సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక సీఎం నోటికొచ్చినట్లు వాగుతున్నారని హరీశ్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ అప్పు మొత్తం రూ.4,26,499కోట్లని అసెంబ్లీ వేదికగా లెక్కలతో సహా నిరూపించామని, కానీ పదే పదే అప్పులపై సీఎం ప్రజల్ని తప్పుదోవ పట్టించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులపై ఆర్థిక నిపుణులతో చర్చించేందుకు తాము సిద్ధమని, రేవంత్ సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కోసం రూ.7,200కోట్ల నిధులు సిద్ధం చేసి రైతుల ఖాతాల్లో వేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకున్నామని, చివరి నిమిషంలో ఈసీకి ఫిర్యాదు చేసి రైతుల నోటికాడి బుక్కను ఆపిన పాపాత్ముడు రేవంత్ అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అరెస్టులు, ఆంక్షలు, నిర్బంధాలు ఒకవైపు బూటకపు ఎన్‌కౌంటర్లు మరోవైపు కొనసాగుతూ అశాంతి రేపుతున్నాయని 'ఎక్స్' వేదికగా హరీశ్ విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఏడాదిలోపే రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైందని మండిపడ్డారు. వృద్ధి రేటు పెంచే సత్తా లేదు. సంపద పెంచలేక ప్రజలకు పంచలేక నోటికి వచ్చినట్లు వాగుతున్నావంటూ ముఖ్యమంత్రిపై విమర్శలు గుప్పించారు. వృద్ధి రేటు పెంచే సత్తా లేదు, సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక నోటికి వచ్చినట్లు వాగుతున్నావు. నెపం ప్రతిపక్షం మీదకు నెట్టుతున్నవు. ఆడరాక మద్దెల ఓడు అనే సామెతకు నీ మాటల్ని మించిన నిదర్శనం లేదు. నీపేరే ఎగవేతల రేవంత్ రెడ్డి. రైతు బంధును ఎవరు ఎగ్గొట్టారో ప్రజలకు తెల్వదా. ప్రజల విజ్ఞత మీద నీకు చాలా తక్కువ అభిప్రాయం ఉందంటూ హరీష్ రావు అన్నారు.అబద్దానికి అంగీ లాగు వేస్తే అచ్చం రేవంత్ రెడ్డి లెక్కనే ఉంటదని. వరుసగా రెండు సంవత్సరాలు కరోనా వచ్చి రాష్ట్ర పరిస్థితి అతలాకుతలం అయిపోయినా కేసీఆర్ రైతు బంధును ఆపలేదు. మా హయాంలో మొత్తం 11 విడతల్లో 72,815 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసిన రైతు బాంధవుడు కేసీఆర్. ఆరు నూరైనా రైతు బంధు ఆపని కేసీఆర్ ఎక్కడా, ఏడాదిలోనే చేతులెత్తేసిన నువ్వెక్కడ కేసీఆర్ పేరు ఉచ్చరించే నైతికత కూడా నీకు లేదు. నీకు దమ్మంటే, రైతుల మీద నిజమైన ప్రేమ ఉంటే, నీది నిజమైన ప్రజాపాలనే అయితే సంపూర్ణ రుణమాఫీతో పాటు, వరంగల్ డిక్లరేషన్ ను తు.చ. తప్పకుండా అమలు చెయ్. అప్పుడు చెయ్యి రైతు పండుగను. అప్పుడు నీ పరిపాలన విజయోత్సవాలు చెయ్యి. పైన పటారం లోన లొటారం, నీ పాలనంత డంబాచారం. ఆ డంబాచారంలో భాగమే రైతు పండుగ, విజయోత్సవాలని విమర్శించారు.



# మందుబాబులకు అడ్డాగా క్రీడా ప్రాంగణాలు

మొదటిపేజీ తరువాయి

లేకపోవడంతో రైతులు వానాకాలం సీజన్ ధాన్యాన్ని నేరుగా క్రీడాప్రాంగాణాల్లో ఆరబోసుకుంటున్నారు. లక్షలు వెచ్చించి నెలకొల్పిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగానే మిగిలిపోవడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ వీటిపై దృష్టిపెట్టి కనీస సౌకర్యాలు, క్రీడా సామాగ్రి ఇప్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో పిల్లలకు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి గత ప్రభుత్వం భావించింది. రాష్ట్రాన్ని క్రీడల్లో దేశంలోనే మేటిగా నిలిపేందుకు మున్సిపాలిటీల్లోని ప్రతివార్డులో తెలంగాణ క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 3,618 వార్డులుండగా వాటిలో 5,001 ప్రాంగణాలు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది. తొలివిడతగా 501వార్డుల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం జోరుగా సాగిన ఆ తర్వాత నెమ్మదించింది. స్థలాల కొరత కారణంగా చాలాచోట్ల పాఠశాల, కళాశాల, జెడ్పీ మైదానాలకే బోర్డులు తగిలించి మమ అనిపించారు. ఎకరా స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉన్నా జాగాలు లేక పావు ఎకరా నుంచి అరెకరంలోనే సర్దుబాటు చేశారు. పేరుకే తప్ప అవి క్రీడాప్రాంగణాలను బోర్డు చూస్తే తప్ప గుర్తుపట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇక క్రీడా ప్రాంగాణల ఏర్పాటుకు మొదల రూ. 5లక్షలు కేటాయించారు. ఆ తర్వాత ఆ మొత్తాన్ని లక్షకు కుదించారు. క్రీడా ప్రాంగాణాల ఏర్పాటు, వసతుల కల్పనకు అప్పట్లో పనులు చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. సర్పంచ్‌లు కొన్ని చోట్ల పనులు చేయించగా.. ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ రాలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామి పథకంలో మెటిరియల్ పెమెంట్ కింద వీటిని డబ్బులు చెల్లించాల్సి ఉండగా బిల్లుల కోసం ఎదురుచుస్తున్నారు. ఒక్కక్క పంచాయతీ పరిధిలో ఈ ప్రాంగాణాల ఏర్పాటుకు రూ.1లక్ష నుంచి రూ.3.50లక్షల వరకు ఖర్చు చేసి అప్పుల పాలయ్యామని ఆందోళన చెందుతున్నారు. రేవంత్ సర్కార్ తమ గోడు వినిపించుకోవాలని వేడుకుంటున్నారు. క్రీడా ప్రాంగణాలలో వాలీబాల్, ఖోఖో, లాంగ్‌జంప్, కబడ్డి అటలాడుకోవడానికి అనువైన కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. యువకులు వ్యాయామం చేయడానికి సింగిల్, డబుల్ బార్లు ఏర్పాటు చేయాలి. క్రీడా ప్రాంగణం చుట్టూ నాటే మొక్కలను రెండేళ్లపాటు సంరక్షించేందుకు ఓ వాచ్‌మెన్‌ను నియమిస్తామని చెప్పారు. ప్రభుత్వం చెప్పినా ఏ ఒక్క అంశం అందుబాటులో లేకపోవడం, పూర్తిస్థాయిలో క్రీడా సామగ్రిని ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. క్రీడా ప్రాంగణాలు మందుబాబులకు అడ్డగా మారాయి. క్రీడల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన మైదానాలను అందుబాటులోకి తీసుకొచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని వ్యాయామ నిపుణులు సూచిస్తున్నారు.





# తెలంగాణపై ఫెంగల్ ఎఫెక్ట్

**వారధి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో రాగల మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. హిందు మహాసముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను నేపథ్యంలో తమిళనాడుతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోనూ వర్షాలు పడుతాయని పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తాయని అంచనా వచేసింది. సోమవారం నుంచి మంగళవారం వరకు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జిల్లాల్లో వానలుపడే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే ఈ నెల 4 వరకు తేలికపాటి జల్లులు పడే సూచనలున్నాయని పేర్కొంది.

# దేశ రక్షణ రంగంలో దూసుకెళ్తున్న ఆధునిక క్షిపణులు



నేటి ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ఆర్థికాభివృద్ధితో పాటుగా రక్షణ రంగంలో కూడా వేగంగా పురోగతి సాధించడం మన దేశానికి చాలా ముఖ్యం. దీనిలో భాగంగా 2024 నవంబర్ 27న స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన దీర్ఘశ్రేణి అణ్వాయుధ సామర్థ్యం గల బాలిస్టిక్ క్షిపణి కె4ను అణుశక్తితో నడిచే జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి విశాఖ తీరం బంగాళాఖాతంలో విజయవంతంగా పరీక్షించడం జరిగింది. మన దేశ క్షిపణి సామర్థ్యాన్ని పెంపొందించుకునే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది ఈ విజయం.

జలాంతర్గామి నుంచి ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి (ఎస్ఎల్బీఎం)ను పరీక్షించడం ఇదే తొలిసారి. ఈ క్షిపణి రెండు దశల ఘన రాకెట్ మోటారు, ఘన రాకెట్ ప్రొపెల్లెంట్ ను ఉపయోగించి 2 టన్నుల పేలోడ్ ను మోసుకెళ్ళే సామర్థ్యముతో 10 మీటర్ల పొడవు, 20 టన్నుల బరువు, 1.3 మీటర్ల వ్యాసం కలిగి ఉంది. ఈ ప్రయోగంతో నేల, నింగి, సముద్రగర్భం నుంచి అణుక్షిపణిని ప్రయోగించే సామర్థ్యం ఉన్న దేశాల సరసన మన దేశం చేరినట్లైంది. 3,500 కిలోమీటర్ల దాడి పరిధి కలిగిన కె4 క్షిపణి బలమైన అణు త్రయాన్ని(న్యూక్లియర్ ట్రయాడ్) అభివృద్ధి చేయడానికి భారతదేశ విస్తృత వ్యూహంలో భాగం. ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి విజయవంతంగా పరీక్షించిన ఈ ప్రయోగం అణు జలాంతర్గామి నౌకాదళాన్ని విస్తరించి అధీనీకరించనుంది. దీనిని జలాంతర్గామి ప్లాట్ఫారం నుంచి గత కొన్నేళ్లలో కనీసం ఐదుసార్లు పరీక్షించారు. వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. గత కొన్నేళ్లుగా మన దేశం వివిధ పరిధుల్లో క్షిపణులను పరీక్షిస్తోంది. పది రోజుల క్రితం ఒడిశా తీరంలో సుదూర హైపర్ సోనిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది.

**కె4 క్షిపణి:**

కె4 అనేది భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) అభివృద్ధి చేసిన జలాంతర్గామి నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణి (ఎస్ఎల్బీఎం). కె4 వంటి జలాంతర్గామి ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు ముఖ్యంగా వాటి అంతర్లీన మనుగడ కారణంగా విలువైనవి. భూ ఆధారిత క్షిపణి లేదా వాయు అణువేదికల మాదిరిగా కాకుండా ఇవి ఎక్కువ కాలం సముద్రజలాల్లో మునిగి ఉండగలవు. శత్రు దేశాలు వీటిని గుర్తించడం, నాశనం చేయడం చాలా కష్టం. ఒకవేళ అణుదాడి జరిగిన కూడా తర్వాత వినాశకరమైన శక్తితో ప్రతీకారం తీర్చుకోగలవు. ఈ క్షిపణి మూడువేల ఐదు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. పది మీటర్ల పొడవు, ఒకటిన్నర మీటర్ల వ్యాసం, ఇరవై టన్నుల బరువు కలిగిన ఇది రెండున్నర టన్నుల వరకు వార్ హెడ్లను మోసుకెళ్లగలదు. భూ ఆధారిత అగ్ని3 క్షిపణికి ఆధునిక రూపాంతరం ఇది. అణుశక్తితో నడిచే జలాంతర్గాములకు ఆయుధాలు అందించడానికి రూపొందించబడింది. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరు మీద రూపొందించిన ఈ క్షిపణి 3,500కు పైగా స్ట్రైక్ రేంజ్ కచ్చితత్వంతో లక్ష్యాన్ని చేధించగలదు. ఈ క్షిపణి స్టెల్త్ అండర్ వాటర్ ప్లాట్ఫామ్ నుంచి ప్రయోగించే సమయంలో శత్రు భూభాగంలోకి లోతుగా దాడి చేస్తుంది. మునుపటి కె15 తో పోలిస్తే ఎక్కువ కార్యాచరణ సౌలభ్యాన్ని అందిస్తాయి. భారతదేశ సముద్ర ఆధారిత న్యూక్లియర్ ట్రయాడ్ ను అమలుచేసే మొదటి క్షిపణి ఇది.

**న్యూక్లియర్ ట్రయాడ్ అంటే ?**

భూ ఆధారిత ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు), జలాంతర్గామి నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులు (ఎస్ఎల్బీఎంలు), అణుబాంబుల క్షిపణులతో వ్యూహాత్మక బాంబర్లతో కూడిన త్రిముఖ సైనిక దళ నిర్మాణాన్ని న్యూక్లియర్ ట్రయాడ్ (అణ్వస్త్ర త్రయం) అంటారు. నాలుగు దేశాలైన అమెరికా, రష్యా, భారత్, చైనాలు మాత్రమే అణ్వస్త్ర త్రయం కలిగి ఉన్నాయి. అణుబాంబులు లేదా అణ్వాయుధ క్రూయిజ్ క్షిపణులను కలిగి ఉన్న విమానాలు, భూమి లేదా సముద్ర లక్ష్యాలపై ఉపయోగించే వాటిని బాంబర్ ఎయిర్ క్రాఫ్ట్ అని ద్రవ లేదా ఘన ఇంధన రాకెట్లతో నడిచే డెలివరీ వాహనాలు ప్రధానంగా బాలిస్టిక్ మార్గంలో ప్రయాణించే వాటిని భూ ఆధారిత క్షిపణులని, నౌకలు లేదా జలాంతర్గాముల నుండి ప్రయోగించే అణు క్షిపణులను బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములని అంటారు. ఈ త్రయం ఒక దేశం భూమి లేదా సముద్రం నుండి వాయుమార్గం ద్వారా అణు దాడి చేయడానికి వీలు కల్పిస్తుంది.

**ఐఎన్ఎస్ అరిఘాత్:**

అరిహంత్ శ్రేణికి చెందిన రెండో దశ జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్. ఈ ఏడాది ఆగస్టు 29న విశాఖపట్నంలో భారతీయ నౌకా దళంలో అధికారికంగా అరిఘాత్ చేరింది. ఉన్నతమైన రూపురేఖలు, తయారీ సంబంధి సాంకేతికత, విస్తృత పరిశోధన అభివృద్ధి, ప్రత్యేక పదార్థాలను ఉపయోగించి క్లిష్టమైన ఇంజినీరింగ్ ప్రక్రియల ద్వారా అధిక ప్రావీణ్య పనితనంతో ఐఎన్ఎస్ అరిఘాత్ నిర్మాణం చేయబడింది. ఈ జలాంతర్గామిపై దేశీయంగా చేసిన సాంకేతిక పురోగతి దాని పూర్వీక అరిహంత్ తో పోలిస్తే గణనీయంగా అభివృద్ధి చెందింది. ఐఎన్ఎస్ అరిహంత్ 750 కిలోమీటర్ల పరిధి గల కె15 క్షిపణులను కలిగి ఉండగా ఐఎన్ఎస్ అరిఘాత్ 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల మరింత అధునాతన కె 4 క్షిపణులను మోహరించగలదు.

**భవిష్యత్తులో ఐఎన్ఎస్ అరిధమాన్:**

ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి విజయవంతంగా పరీక్షించిన ఈ ప్రయోగం అణు జలాంతర్గామి నౌకాదళాన్ని విస్తరించడానికి, ఆధునీకరించడానికి భారతదేశం చేస్తున్న విస్తృత ప్రయత్నంలో భాగం. ఆగస్టు 2024 లో ప్రారంభించిన ఐఎన్ఎస్ అరిఘాత్ భారతదేశ ఆయుధాగారంలో రెండవ ఎస్ఎస్బిఎన్ పన్నెండు కె5 క్షిపణులు, నాలుగు కె4 క్షిపణులు, ముప్పై టార్పెడోలను మోసుకెళ్లగలదు. అణ్వాయుధ నిరోధక వైఖరిని పటిష్టం చేసుకునే భారత్ ప్రయత్నంలో ఇది కీలక ముందడుగు. వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్న ఐఎన్ఎస్ అరిధమాన్ భారత్ తన అణ్వస్త్ర నిరోధకతను మరింత మెరుగుపరుచుకునే పనిలో ఉంది. ఇది 5,000 కిలోమీటర్లకు మించిన పరిధి కలిగిన క్షిపణులను మోసుకెళ్లగల ఎస్ఎస్బీఎన్ల ఫ్లీట్ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ వెసెల్ (ఏటీవీ) ప్రాజెక్టులో భాగం. ఈ జలాంతర్గాముల్లో కె5, కె6 వంటి శక్తివంతమైన క్షిపణులు ఉంటాయి. ఇవి 6,000 కిలోమీటర్ల వరకు దాడి పరిధిని కలిగి ఉంటాయి.



జనక మోహన రావు దుంగ
యం.యస్సీ (ఫిజిక్స్)
ఫోన్ 8247045230



# 6 అబద్ధాలు.. 66 మోసాలు..

మొదటిపేజీ తరువాయి

ఈ ఏడాది కాలంలో హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం విజయోత్సవాలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

**ప్రజలు ఆశ్చర్యపోతున్నారు..**

కాంగ్రెస్ విజయోత్సవాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. విజయోత్సవాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మిగతా పార్టీల మాదిరిగా మేం భాధ్యతారాహిత్యంగా విమర్శలు చేయడం లేదని ప్రభుత్వానికి ఏడాది కాలం పాటు గడువు ఇచ్చాం. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన పనులతో పాటు ఏడాదిలోపు మొదలు పెడతామన్న పనుల విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని వాటిని ప్రజల ముందు పెడుతున్నామన్నారు. గ్యారెంటీలు, డిక్లరేషన్ పేరుతో ఆయావర్గాలను నమ్మించిందో ఆ అంశాలపై తెలంగాణ ప్రజల పక్షాన చార్జిషీట్ రూపంలో విడుదల చేస్తున్నామని చెప్పారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే..**

ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అక్రమ కేసలు, అరెస్టులు, లాఠీచార్జీలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడాలేదన్నారు. లోక్ సభ ఎన్నికల్లో తమకు కాంగ్రెస్ తో సమానంగా సీట్ల వచ్చాయని అందువల్ల ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యత మాపై ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై విమర్శలు చేయాలంటే రెండు రోజులు పడుతుంది. రుణమాఫీ అసంపూర్ణంగా అమలైందన్నారు. రైతుభోరో పేరుతో తెలంగాణ రేతులకు వెన్నుపోటు పొడిచింది. పండించిన పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం వరికి మాత్రమే ఇవ్వడం ఏంటని నిలదీశారు. దోపిడీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని బీజేపీ విమర్శించింది. మారింది పాలకులే కానీ పాలన, ప్రజల బతుకులు మారలేదని విమర్శించారు.



# ముగిసిన కార్తీక మాస వైభోత్సవం

* ఏడుపాయలలో ముగిసిన కార్తీక మాసం ఉత్సవాలు

వారధి న్యూస్, పాపన్నపేట:

జనమే జయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ సాయంత్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక మాసం చివరి రోజైన ఆదివారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి ఆలయ ప్రాంగణంలో మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించారు. అర్చకులు పార్థివశర్మ రంగురంగుల కలర్లతో వనదుర్గమ్మ ముందు 'వనదుర్గమ్మ' ఆకృతి రూపొందించి చుట్టూ దీపాలతో అందంగా అలంకరించారు.

## గ్రంథాలయం

జ్ఞాన బండాగారం గ్రంథాలయం
పుస్తకాల నిలయం విజ్ఞాన సంపద
మనిషి వికాసానికి మూల స్తంభాలు
సమాచార కేంద్రం గ్రంథాలయం!!
బంగారు భవిష్యత్తుకు బాటలు
బాలల వినోదాల గ్రంథాలయం
తరతరాల విజ్ఞాన సంపద
మనిషిని మనీషిగా మార్చేది!!
సరస్వతి నిలయం గ్రంథాలయం
భవితకు బాట గ్రంథాలయం
అక్షరాల ఆలయ మది
పుస్తకాల పరిచయం అది!!
విలువలెన్నో నేర్పుతది
విజ్ఞానులను చేస్తది
పాఠకులకు జ్ఞాన సంపద
సమాజ వికాసానికి మూల స్తంభాలు!!



దేవులపల్లి రమేశ్,
సిద్దిపేట, నంగునూర్
చరవాణి 9963701294

## హరితఛత్రం!



గొడ్డళ్ళతో కర్కశంగా నరికినా
పచ్చదనం పలవరింత ఆపకుండా
లేలేత మృదు చిగుర్లతో
నిత్యం పలకరించే అమాయకత్వం
పిట్ట రెట్టేసినా భూమిని చీల్చుకొని మొలిచి
ఆకుపచ్చ కల్పతరువై ఆశీర్వదించే మాతృత్వం
పంచభూతాల సాక్షిగా
సమస్త జీవరాశులకు ఆధారభూతమైన జగతిని
చలువ పందిళ్ళతో కప్పి రక్షించే దైవత్వం
ధనం అనే ఆశాపాశం
మనిషిని మరమనిషిగా
మరో మనిషిగా మార్చేయడంతో
నరుడే వేరు పురుగై
హరితాన్ని హరిస్తూ
విలువ కట్టలేని తరువుల స్థాయిని
నోటుతో దిగజార్చి
పచ్చదనాన్ని ఆక్రమిస్తూ
వన్యజీవుల నీడ చెరిపేస్తూ
కాలుదై సాగిస్తున్న విధ్వంస కాండకు
ప్రకృతి కాలుష్య దృక్కులతో
విలయోత్పాతంగా చూస్తూ
సమస్త భూమండలాన్ని అతలాకుతలం
చేస్తున్నా, మనిషిలో మార్పు రాదేం..!
(జాతీయ కాలుష్య నియంత్రణ దినం )



భీమవరపు పురుషోత్తమ్
Sbi Innispet branch
Rajahmundry
9949800253

## నేడు జాతీయ కాలుష్య నియంత్రణ దినం

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వారధి న్యూస్, పెబ్బేరు: తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు లో భాగంగా విద్యా శాఖ ఆద్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదివారం పెబ్బేరు మండల వనరుల కేంద్రం లో మండల విద్యాధికారి ఎస్. జయరాములు పర్యవేక్షణలో వ్యాసరచన పోటీలను వివిధ పాఠశాలల నుండి వచ్చిన 40 మంది విద్యార్థులకు రెనేబుల్ ఎనర్జీ రిసోర్స్ అనే అంశంపై అనే అంశం మీద వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన్నట్లు మండల విద్యాదికారి జయరాములు తెలిపారు. కార్యక్రమం లో వివిధ పాఠశాలల నుండి సైన్స్ టీచర్స్ శ్రీనివాసులు గోపాల్ నాయక్, సాయికుమార్ పాల్గొన్నారు.



## పట్టభద్రుల గొంతుకగా పనిచేస్తా

- గత పాలకులు గ్రాడ్యుయేట్స్ కు చేసిందేమిలేదు
- నిరుద్యోగుల గోడు పట్టని పాలకులు
- తెలంగాణ స్వరాజ్యం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నాచారం చంద్రశేఖర్

వారధి న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి

త్వరలో రాబోయే ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్ ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా తెలంగాణ స్వరాజ్యం పార్టీ నుంచి పోటీచేస్తున్నట్లు పార్టీ వ్యవస్థాపకులు నాచారం చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం మెదక్ లోని ద్వారకా గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన విలేకర్లతో అయన మాట్లాడారు. మెదక్ పట్టణానికి చెందిన తాను కరోనా సమయంలో వేక్ అప్ ఆర్గనైజేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.ఓటరు నమోదు చేయని అభ్యర్థులు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. గత పాలకులు పట్టభద్రులను, నిరుద్యోగ యువతను పట్టించుకున్న పాపానపోలేదన్నారు.ఎన్నికల సమయంలో వచ్చి హడావిడి చేసి పవర్ లోకి వచ్చాక కన్నెత్తి చూడటం లేదన్నారు. మండలి లో ఏనాడూ నిరుద్యోగుల గురించి ప్రస్థావించిన పాపానపోలేదన్నారు. పట్టభద్రులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకొని వారి కోసం చట్ట సభల్లో గళం విప్పే అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. తాను ఎమ్మెల్సీ అభ్యర్థి గా బరిలో ఉంటున్నానని, వారి గొంతుకగా పనిచేస్తానన్నారు.డబ్బు సంచులతో నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు కార్పొరేట్ పెట్టుబడుదారులు వస్తున్నారని, వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. తన వద్ద డబ్బులు లేకపోయినా పట్టభద్రుల కోసం ప్రశ్నించే తత్వం ఉందన్నారు.వారి హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటాలు చేయడానికైనా సిద్ధంగా ఉన్నానన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత గా తనకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ స్వరాజ్యం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగల్ల సందీప్ కుమార్,జిల్లా నాయకులు రవి కిషోర్,ప్రభాకర్,బాలు,సాయిరాం ,ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## జగిత్యాల జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్.పి అశోక్ కుమార్ ఐపీఎస్..

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి




జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని నెల రోజుల పాటు ( డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు,నిరసనలు, ర్యాలీలు,పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించారాదని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## హాస్టల్ విద్యార్థుల భోజనాల్లో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ భారీ కుట్రా: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వారధి న్యూస్, వనపర్తి :

రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠతను దెబ్బతీయడానికి బీఆర్ఎస్ పార్టీ మరియు ఆ పార్టీ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సంక్షేమ గురుకుల హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ కుట్రకు పాల్పడుతున్నారని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పనిచేసిన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ నామినేటెడ్ పద్ధతిలో ఫుడ్ కాంట్రాక్టులు, వర్కర్ల నియామకం చేయడం, ఆ నియామకాలతో ఇప్పటికీ ఆయన ప్రభావం కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటూ డైట్ మరియు కాస్మోటిక్ చార్జీలను పెంచడం వంటి విధానాలతో ప్రజల విశ్వసనీయతను పెంచుతుండటం బీఆర్ఎస్ నాయకులకు జీర్ణించలేకపోయే అంశమని పేర్కొన్నారు.

**ఆహార విషపూరిత ఘటనలపై తీవ్ర విమర్శలు**

"కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొలేని బీఆర్ఎస్ పార్టీ కుట్ర పన్నుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోంది. విద్యార్థులపై చేసిన విష ప్రయోగాలు నిందనీయమైనవి," అని మేఘారెడ్డి అభిప్రాయపడ్డారు.వనపర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని మండలాల్లోని KGBV, SC, ST, BC, మైనారిటీ వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి మనోధైర్యాన్ని పెంపొందించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పిలుపునిచ్చారు. "వసతి గృహాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని" ఆయన సూచించారు.

**కాంగ్రెస్ నిర్ణయాలు**

బీఆర్ఎస్ పార్టీ కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ కార్యాచరణను ముమ్మరం చేస్తున్నారు. "విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతూ, వారికి అండగా నిలబడడమే ప్రభుత్వ ధ్యేయం," అని మేఘారెడ్డి హామీ ఇచ్చారు.





## ర్యాలమడుగులో నీటి గోస..

- ఐదు రోజులుగా సమస్య
- .పట్టించుకోని అధికారులు

వారధి న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి

మెదక్ జిల్లా మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామంలో నీతి కటకట. గత ఐదు రోజుల నుండి నీళ్లు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పిఎసిఎస్. గోదాం.నిర్మాణంలో భాగంగా జెసిపిలతో పిల్లర్ గుంతలు తీసే క్రమంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో మిషన్ భగీరథ పైప్ లైన్ పలిగిపోవడంతో నీటి బాధ తప్పడం లేదన్నారు పక్కన పసుపులేరు వాగు ఉన్న పైన చెరువు ఉన్న గ్రామానికి నీళ్ల బాధ మాత్రం తప్పలేదని గ్రామస్తులు నీటికోసం మాత్రం వాటర్ ట్యాంకర్ల కోసంఎంతోఎదురుచూస్తున్నామన్నారు. గ్రామం ఏర్పడ్డ నుండి ఇలా ట్యాంకర్ల ద్వారా నీళ్లు పట్టుకోవడం ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామాలలో పాలకమండలి లేక ప్రత్యేక అధికారులు.. పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ఎద్దడిని తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.



## కన్నుల పండువగా కార్తీక మాస లక్ష దీపోత్సవం

హాజరైన బీసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాను పాటి ప్రదీప్ కుమార్, కళానిలై వ్యవస్థాపక అధ్యక్షుడు అజయ్ నటరాజ్

వారధి న్యూస్,షాద్ నగర్:-

షాద్ నగర్ పట్టణం హాజీపల్లి రోడ్‌లో జరిగిన కార్తీక మాస లక్ష దీపోత్సవం వేడుకలు ఎంతో ఘనంగా అట్టహాసంగా కొనసాగాయి. చత్రపతి శివాజీ కల్చరల్ & సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చివరి రోజైన శనివారం లక్ష దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మహా మృత్యుంజయ పాశుపతం, వేద ఘోష, గోపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, కార్తీక దీప ఆరాధన, మహా మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణతో ఈ వేడుకలు భక్తి భరితంగా కొనసాగాయి.మహిళలంతా లక్ష దీపాలను వెలిగించి విశేషంగా పాల్గొన్నారు.బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు అజయ్ నటరాజ కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు మానపాటి ప్రదీప్ కుమార్ ప్రత్యేక ఆకర్షణగా కాశీ క్షేత్రం నుండి తెచ్చిన శివలింగానికి అభిషేకం చేసి పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం అదృష్టం గా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణు సహస్ర నామ పారాయణ మండలి అధ్యక్షులు తవిడి శెట్టి స్వరాజ్ బాబు , విష్ణు సహస్ర నామ పారాయణ మండలి ఆర్థిక కార్యదర్శి సభ్యులు మానపాటి విజయ రత్నం , అఖిల భారత యాదవ సంఘం తాలుకా అధ్యక్షులు షాబాద్ మల్లేష్ యాదవ్ , ఇస్నాతి గంగాధర్ ,ప్యాట అశోక్ , మల్చాలం రాము ,శ్రీకాంత్ , షాబాద్ శ్రీశైలం యాదవ్, పాటు శ్రీశైలం యాదవ్, జయ ,విమల , గీత, సువర్ణ , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి 15 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే...

- జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్..

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి



కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తుంపు సర్వే డిసెంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభంకానుందని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్.. తెలిపారు.డీ.ఎం.హెచ్.ఓ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్ (ఎయిడ్స్, లెప్రసి) డాక్టర్ ఎన్. శ్రీనివాస్ తో కలిసి వైద్యాధికారులు, సూపర్వైజర్ ల సమావేశంలో ఆయన మాట్లాడారు.డిసెంబర్ రెండవ తేదీ నుండి డిసెంబర్ 15వ తేదీ వరకు లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్.సి.డి.సి) సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు.జిల్లాలోని 17 పీహెచీసీ, 5 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో సర్వే కొనసాగుతుందన్నారు.ఈ సర్వేలో ఆరోగ్య కార్యకర్తలు (ఏ.ఎన్.ఎం ) లు, ఆశా కార్యకర్తలు పాల్గొని సర్వే పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు.జిల్లాలో ప్రస్తుతం 34 కేసులు యాక్టివ్ ఉన్నాయన్నారు.కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చని తెలిపారు.సర్వే నిమిత్తం ఇండ్లకు వచ్చే బృందాలకు పూర్తి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కుష్టు రహిత జిల్లాను తయారు చేయడంలో సహకారం అందించాలని కోరారు. సమావేశంలో వైద్యాధికారులు సూపర్వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు కే. భూమేశ్వర్, తరాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి...

ఎమ్మెల్యే సంజయ్ కుమార్..

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి

ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.ఆదివారంజగిత్యాల పట్టణంలోని 7వ వార్డులో రూ. 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తో కలిసి భూమి పూజ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలిపించిన ప్రజలకు నియోజకవర్గం అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని అని తెలిపారు.ప్రజల అభీష్టం మేరకు వార్డు అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు.గత 5 ఏండ్ల లో ప్రతి వార్డుకు దాదాపు రూ. 2 కోట్ల వరకు నిధులు మంజూరు చేయటం జరిగిందని,అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, స్థానిక కౌన్సిలర్ రేణుక మొగిలి, కోలగని ప్రేమలత సత్యం ,కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్ ,పట్టణ వార్డు నాయకులు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న సినీ హీరో శ్రీకాంత్

**ఆలయంలో ప్రత్యేక పూజలు..**

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి ;

ప్రముఖ హీరో శ్రీకాంత్,నటుడు చంద్ర కాంత్, నిర్మాత విజయ్ లు ఆదివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు వారికి వేదోచ్చరణతో స్వాగతం పలికారు. ఆలయ ఈఓ ఎం.రామకృష్ణ రావు శేషవస్త్రం కప్పి వారికి లడ్డు ప్రసాదం అందజేశారు.అనంతరం హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ కార్తిక మాస చివరి ఆదివారం నేపథ్యంలో కొండ గట్టు అంజన్నను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్తీకమాసం నేపథ్యంలో ఈ మాసం మొత్తం ఉపవాసం చేశానని చెప్పారు. కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో ఏ.ఈ.ఓ అంజయ్య, పర్యవేక్షకులు గుండి హరిహర నాథ్, సునీల్ ,ఉపాధ్యాయుల చంద్ర శేఖర్,దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ లు తదితరులు పాల్గొన్నారు.



## ఆంజనేయ స్వామి ఆలయానికి సౌండ్ సిస్టం సెట్ వితరణ

వారధి న్యూస్ పెబ్బేరు:

పట్టణంలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయానికి పెబ్బేరుకు చెందిన స్వామి భక్తులు వల్లభ్ రెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి యాబై వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్ సెట్టును వితరణగా అందజేశారు. గత కొంత కాలంగా ఆలయంలో మైక్ లేక భక్తులకు భక్తి గీతాలకు ఇబ్బందులు ఉండేవని ఆలయ అర్చకులు నవీన్ కుమార్ చార్యులు తెలిపారు. భక్తుల కోర్కెల మెరకు వల్లప్ రెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి దంపతులు స్పందించి ఆలయానికి సౌండ్ సిస్టమ్ సెట్ వితరణ చేసినందుకు ఆలయ కమిటీ తరపున వారికి ధన్యవాదాలు తెలుపుతున్నాని తెలిపారు. కార్యక్రమంలో గౌని బూచరెడ్డి, లక్మికాంతా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, బసాల వెంకటేశ్వర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మేకల ఎల్లయ్య, రాజశేఖర్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి

- **వనదుర్గమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు**
- **ఆదివారం భక్తులతో కిటకిటలాడిన ఏడుపాయల క్షేత్రం**

వారధి న్యూస్, పాపన్నపేట:



దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయం.. జనమే జయుని సర్పయాగ స్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ఆధ్యాత్మిక వాతావరణం.. ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, బండరాళ్లు, గలగల పారే గంగమ్మ పరవళ్ళు.. ప్రకృతి ఒడిలో సేదతీరుతున్నామని పించే అనుభూతి.. ఇదీ పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా మాత సన్నిధిలో ఆదివారం నెలకొన్న వాతావరణం. వేకువ జామునే ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వనదుర్గమ్మ దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు ముందుగా చెక్ డ్యాం, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి, వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్ళ, మేళ తాళాలతో బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. మమ్మేలు మాయమ్మ.. ఏడుపాయల వనదుర్గమ్మ తల్లీ.. అంటూ వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లోని షెడ్లు, పచ్చని చెట్ల కింద భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుపయనమయ్యారు.





## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కృపా కటాక్షాలు ప్రజానీకం పై ఉండాలి..

- **రాబోయే పుష్కరాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తాము...**
- **ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్....**
- **ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోదావరి మహా హారతి...**

వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కృపా కటాక్షాలు యావత్ ప్రజానీకం పై ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఆదివారం పవిత్ర కార్తీక మాసం చివరి రోజు సంధర్బంగా ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నది వద్ద నిర్వహించిన మహ హారతి కార్యక్రమంలో విప్ ముఖ్య అతిథిగా పాల్గోన్నారు.ఈ సందర్భంగా గోదావరి వద్ద వేద పండితులు నిర్వహించిన పూజాధి కార్యక్రమాల్లో పాల్గొని గోదావరి నదీమ తల్లికి మండల నాయకులు,అధికారులతో కలిసి హారతి ఇచ్చారు.మహిళలకు కార్తీక మాసం సందర్భంగా ప్రభుత్వం నుండి వచ్చిన తాంబులలను మహిళలకు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాస చివరి రోజు ధర్మపురి పుణ్య క్షేత్రంలో నిర్వహించే మహా హారతి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని,గత నెల రోజుల నుండి కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి గోదావరి నదీమ తల్లికి హారతి కార్యక్రమన్ని వైభవోపేతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ ప్రాంత ప్రజల పై గోదావరి నదీమ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.రానున్న పుష్కరాలు కూడా వేద పండితుల, అర్చకుల సూచనల మేరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ అధికారులు,అర్చకులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## బంధనాల్లో బాల్యం ...

- **మాఫియా చేతుల్లో...11వేల మంది చిన్నారులు**
- **చెడు బాట ...పట్టొచ్చని హక్కుల సంఘాల ఆందోళన**
- **నినాదానికే పరిమితమైన 'బెగ్గర్ ఫ్రీ సిటీ'**

వారధి న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి

యాచకుల సామాజిక సర్వే చేసి ఆ ఉచ్చులో చిక్కుకున్న జీవితాలకు దారి చూపిస్తామనే ప్రకటన 2002 మార్చిలో ప్రారంభమై నేటికీ వినిపిస్తూనే ఉంది. అప్పటి నగర మేయర్ తీగల కృష్ణారెడ్డి నుంచి బొంతు రామ్మోహన్ విజయలక్ష్మి. వరకు అందరూ ఈ నినాదాన్ని ఇస్తూనే ఉన్నారు. కానీ వాగ్దానాన్ని నెరవేర్చే యంత్రాంగం మాత్రం కరవైంది. పైగా వెళ్లిన ప్రతివేదికపై అదే ప్రకటన చేస్తున్న ప్రస్తుత నేతలు, అధికారులు ఇంత వరకు ఆ దిశగా ఒక్క చర్య కూడా చేపట్టకపోవడం గమనార్హం.మహానగరంలో ఉన్న వీధిబాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. నగరవ్యాప్తంగా వారి సామాజిక దురవస్థపై ఇటీవల సర్వే నిర్వహించిన 'సేవ్ ది చిల్రన్' అనే స్వచ్ఛంద సంస్థ సైతం గ్రేటర్‌లో 28వేల మంది వీధి బాలలున్నారని తేల్చింది. చదువుకోవాల్సిన వయసులో రహదారులపై బిచ్చమెత్తుకోవడం, వస్తువులు విక్రయించుకుంటూ రైల్వేస్టేషన్లు,... బస్టాండ్లు, ఫుట్ పాత్‌లపై.... జీవనం సాగిస్తున్నారని నిపుణులు పేర్కొన్నారు. సుమారు.... 11వేల మంది బాలలు ...నకిలీ బిచ్చగాళ్ల చేతిలో చిక్కుకున్నారని బాలల హక్కుల సంఘం నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిచ్చగాళ్ల మాఫియాలోని చిన్నారులంతా ఎల్‌బీనగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతర శివారు ప్రాంతాల్లో కనిపిస్తారు. నెలల వయసున్న చిన్నారులనూ దీనంగా తయారుచేసి బిచ్చమెత్తుకునేందుకు ఉపయోగిస్తున్నారు. మెజార్టీ పిల్లలను వెట్టిచాకిరికి ఉపయోగిస్తూ లైంగికదాడులు చేస్తున్నారు. కొందర్ని అక్రమరవాణా చేస్తున్నారు. ఇదే విషయమై 'బెగ్గర్ ఫ్రీ సిటీ' కార్యక్రమంపై జీహెచ్ఎంసీ ఎలాంటి చర్యలు ప్రారంభించిందని ఓ సీనియర్ అధికారిని వివరణ కోరగా.. ఇంత వరకు ఏలాంటి చర్యలు తీసుకోవాలనడం గమనార్హం.





**ఇవీ బాధ్యతలు..**

* చట్టప్రకారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చెందిన జిల్లా బాలల పరిరక్షణ అధికారులు వీధిబాలల్ని గుర్తించి వాళ్లను సురక్షిత ప్రాంతంలో ఉంచాలి. అక్కడి తీసుకెళ్లాక ఆరోగ్యం, మానసిక ప్రవర్తలను పరీక్షించి అవసరమైన మేర చికిత్స చేయించాలి. అనంతరం పిల్లల తల్లిదండ్రుల సమాచారాన్ని సేకరించాలి. వాళ్లు అనాథలైనా, తల్లిదండ్రుల ఆచూకీ లభించకపోయినా చిన్నారులు పెద్ద అయ్యేంత వరకు విద్యా బుద్ధులు నేర్పించాల్సి ఉంటుంది.

* వీధుల్లో అనుమానాస్పదంగా సంచరించే పిల్లలు కనిపిస్తే వాళ్లను సంక్షేమశాఖ అధికారులకు అప్పగించాల్సిన బాధ్యత పోలీసుశాఖ తీసుకోవాలి. చట్టప్రకారం.. ఏ ఆదరణ లేని చిన్నారులు వీధుల్లో తిరగకూడదు. అసాంఘిక శక్తులు, నేరగాళ్లు వాళ్లను అపహరించే అవకాశముంది. శారీరకంగా, మానసికంగా, లైంగికంగా పిల్లల్ని వేధిస్తారు.

* నిబంధనల ప్రకారం.. 'ఫిట్' సర్టిఫికెట్ ఉన్నప్పుడే స్వచ్ఛంద సంస్థల్ని నిర్వహించాలి. కానీ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొన్ని స్వచ్ఛంద సంస్థలు చిన్నారులను చేరదీసి వాళ్లతో బిచ్చమెత్తిస్తున్న ఘటనలు అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవలే అలాంటి రెండు సంస్థలపై పోలీసులు కేసు నమోదు చేయడం గమనార్హం.

**ఇలా చేయాలి..**

* పోలీసు, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలతో కలిసి జీహెచ్ఎంసీ బిచ్చగాళ్ల సామాజిక స్థితిగతులపై లోతైన అధ్యయనం చేపట్టాలి. వయసుల వారీగా, ప్రాంతాల వారీగా బిచ్చగాళ్ల వివరాలను నమోదు చేయాలి.

* నకిలీ బిచ్చగాళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించి వెనక్కి పంపాలి. సామాజిక పరిస్థితుల దృష్ట్యా బిచ్చగాళ్లుగా మారిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధి కార్యక్రమాల్లో నిమగ్నం చేయాలి.

* చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యం, వ్యాధులతో ఉన్న వాళ్లకు వైద్యం చేయించాలి. తల్లిదండ్రుల ఆచూకీ కనుక్కొని ఇంటికి పంపాలి. ఆచూకీ లభించకపోతే విద్య, వసతి సమకూర్చి సంరక్షణ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. ఇదే జరిగితే నెలల వయసు నుంచి 17ఏళ్ల మధ్య వయసున్న సుమారు 11వేల మంది బాలలకు విముక్తి లభిస్తుంది.





## అమ్రాబాద్ నల్లమల్ల ప్రాంతాన్ని టూరిజం హబ్ గా అభివృద్ధి పరుస్తాం

- **సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి సహకారంతో నల్లమల్లను అగ్రగామిగా నిలుపుతాం**
- **సిపిఎం ట్రస్ట్ ద్వారా చెంచులకు దుప్పట్లను పంపిణీ చేసిన మంత్రి సీతక్క**

వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:

అడవులను రక్షిస్తూ నే అడవులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న చెంచుల జీవన స్థితిగతులను మార్చేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, శ్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల్ల అడవి ప్రాంతంలో నీ చెంచులకు సిబిఎం ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతుల తో కలిసి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరితగతిన అంతరించిపోతున్న ఆదిమ జాతి చెంచు బిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. అడవులను రక్షించడంతోపాటు అడవిని నమ్ముకుని జీవిస్తున్న చెంచులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అమ్రాబాద్ నల్లమల్ల ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను టూరిజం హబ్ లోకి తీసుకువెళ్లి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక చెంచు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మల్లెల తీర్థం పర్యాటక ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. నల్లమల్ల కు వచ్చిన మంత్రి సీతక్కకు స్థానిక ఆదివాసి గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అచ్చంపేట మండలంలోని కన్య తండాలో నూతనంగా మంజూరైన బీటు రోడ్డుకు పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం ఉప్పునుంతల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన చేసి అనంతరం గద్వాల జిల్లాకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక





## క్రీడాకారులకు టీ షర్టు పంపిణీ

- ప్రతి క్రీడాకారుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలి.
- డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్

వారధి న్యూస్, మహబూబాబాద్ ప్రతినిధి:

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలోసూపర్ లింగ్ సీజన్ 2 కి చిన్నగూడూరు మండలం నుంచి ఆటలాడుతున్న మండల యువకులకు డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ టీషర్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందడం తోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతాయన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శరీరానికి సరైన వ్యాయామం లేకపోతే రోగాల బారినపడే అవకాశం ఉంటుందన్నారు. ఒకే చోట కూర్చొని కంప్యూటర్ ఉద్యోగం చేసే వారు తప్పనిసరిగా ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం లేదా క్రీడలకు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌతం, మనోజ్, మురళి, రాకేష్, శ్రీకాంత్, యాసీన్, ప్రకాష్,సలీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## జోరుగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం

వారధి న్యూస్, పెబ్బేరు: మండలంలోని తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి ప్రజలు ఉత్సాహం చూపిస్తున్నారని రాష్ట్రపార్టీ కార్యదర్శి ఎస్. రామన్ గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని పాతపల్లి, రంగాపూర్ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం చేయించడం జరిగిందన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతు తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేస్తూ సభ్యత్వ కార్యక్రమాలను కొనసాగించాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో కొంతమంది భూస్వాముల ఆదిపత్యాన్ని నియంత్రించి పేద బడుగు,j బలహీన వర్గాలను అనేక అవకాశాలు కల్పించిందని ఆయన పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తెలుగుదేశం పార్టీని తెలంగాణలో సైతం మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలందరూ కృత నిశ్చయంతో కృషి చేయాలని ఉద్బోధించారు రవీందర్ నాయుడు, పాతపల్లి గ్రామంలో కే. శిరీష పి. జి. ఎకనామిక్స్ చదువుతున్నారు తెలుగు దేశం పార్టీ పై నారా చంద్రబాబు పై అభిమానం తో ఉత్సహంగా సభ్యత్వం తీసుకున్నారు. భీందుమతి, పద్మమ్మ, కే. శివశంకర్, ఏ. చరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు

## నవంబర్ నెలలో 99శాతం బొగ్గు ఉత్పత్తి

**- ఆర్జీ- 3 జీఎం సుధాకరరావు**

వారధి న్యూస్, గోదావరిఖని :



నవంబర్ నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ సుధాకరరావు ఆదివారం తెలియజేశారు. ఆర్జీ3 ఏరియాకు నిర్దేశించిన 5.68 లక్షల టన్నుల లక్ష్యానికిగాను, 5.62 లక్షల టన్నులు 99శాతం బొగ్గు ఉత్పత్తి తోపాటు నిర్దేశించిన 43.10 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబి మట్టి వెలికి తీత లక్ష్యానికిగాను, 40.25 లక్షల క్యూబిక్ మీటర్లతో 93శాతం వెలికి తీయడం జరిగిందని, 6.44 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. గనుల వారిగా ఉత్పత్తి వివరాలిలా ఉన్నాయి. ఓసిపి 1 గనికి నిర్దేశించిన 3.28 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 2.54 లక్షల టన్నులు అనగా 78 శాతం, ఓ.సి. పి2 గనికి నిర్దేశించిన 2.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 3.08 లక్షల టన్నులు అనగా 128 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. అందుకు కృషి చేసిన ఉద్యోగులందరికి అభినందనలు తెలియజేశారు. భవిషత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు. ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు.

# సర్పంచ్ పదవికి యమా క్రేజ్

- పదవిపై యువత ఉత్సాహం
- గ్రామాల్లో వరసలతో పలకరింపులు
- పంచాయతీలో ముందస్తు ప్రచారాలు

వారధి న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి





ఫిబ్రవరి నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వం నిర్వహిస్తుందని యువత నోటిఫికేషన్ వెలువడక ముందే పోటీల్లో నిలబడాలని అటు యువత ఇటు పలు పార్టీల రాజకీయ నాయకులు ఇప్పటినుంచి ప్రయత్నాలు గ్రామపంచాయతీలలో మొదలుపెట్టారు. గతంలో పోలిస్తే ఎన్నడూ లేని విధంగా ఈసారి యువత రాజకీయాల్లోకి రావడానికి అదేవిధంగా సర్పంచ్ పదవిపై పోటీ చేసేందుకు ఎక్కువ మంది పోటీలో ఉండే అవకాశం కనిపిస్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అటు రూలింగ్ ప్రభుత్వంలో ఎటు ప్రతిపక్షంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో యువ లీడర్లు గ్రామపంచాయతీలలో ప్రచారం ఇప్పటికే రాజకీయ నాయకుల లోపల ప్రచారాలు చేపట్టారు అలాగే ఊహాగానాలు వెళ్ళువెతుతున్నాయి. దీనికి తోడు గ్రామపంచాయతీలలో రచ్చబండ వద్ద చౌరస్తాల్లోని ప్రధాన కూడలిలో హోటల్లో కిరాణా షాపుల వద్ద ఉన్న పెద్ద మనుషులతో ముందస్తుగా వరుసలు కలుపుతూ ఏం మామ ఏం బావ. తమ్ముడు అన్న బాగున్నావా అని పలకరిస్తూ ఈసారి సర్పంచ్ పదవికి నిలబడతామని అనుకుంటున్నాను. ఒకసారి కలిసి వెళ్లి పోదామని వచ్చాను అని మాట ముచ్చట కలుపుతున్నారు. రాజకీయ నాయకులు ప్రతిపక్ష పార్టీ అయినా బిఆర్ఎస్. బిజెపి. అలాగే కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేయడానికి ఎక్కువ సన్నాహాలు చేస్తున్నారు. అటు కాంగ్రెస్ రాజకీయ నాయకులు అధికారంలో ఉన్న అభివృద్ధి చేస్తున్నాం కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో మేమే గెలుస్తామని ధీమతో ఉన్నారు. కాదు కాదు ఆరు గ్యారెంటీ ల వల్ల ప్రజలు పూర్తిగా మోసపోయారని. ఈసారి బిఆర్ఎస్ పార్టీకే పట్టం కడతారని రాబోయేది మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమే అని బిఆర్ఎస్ నాయకులు అంటున్నారు. ఏది ఏమైనా గ్రామాల్లోని కుల సంఘాల నాయకులతో గతంలో రాజకీయ అనుభవాలున్న పెద్ద మనుషులతో యువత మంతనాలు జరుపుతున్నారు. రాజకీయ నాయకులు కూడా ఈసారి కచ్చితంగా సర్పంచ్ బరిలో ఉంటాం అని బల్లగుద్ది మరి చెబుతున్నారు. కొందరు నాయకులు గ్రామంలోని స్థానిక వాట్సాప్ గ్రూప్ లలో ఈసారి మా పలానా వ్యక్తి సర్పంచ్ కె గెలుపు పక్క లేదు మా పలాన వ్యక్తి ఆపక్క అనే విధంగా వాట్సాప్ గ్రూపు ఈసారి మా పలాన వ్యక్తి ఆ పక్క అనే విధంగా వాట్సాప్ గ్రూప్ చర్చ వేదికగా మారింది. ఏది ఏమైనా అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల కన్నా స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూపులు అంతా ఇంతా కాదు ఇది ఇలా ఉంటే కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి పార్టీ గ్రామస్థాయిలో పెద్దగా కనిపించడం లేదు. అప్పుడప్పుడు కనిపిస్తున్న కూడా ప్రజల్ని సరిగా పట్టించుకోవడం లేదని ఊహాగానాలు ఉన్నాయి. ఇక్కడ సభలు పెడతారు ఎక్కడ సమావేశాలు చెబుతారు వారికి తెలియదని కొందరు బిజెపి శ్రేణులు అంటున్నారు. కొన్ని పార్టీల వారు వారి సిద్ధాంతం కోసం బాగానే పనిచేస్తున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీకి పట్టం కడతారో వేచి చూడాల్సిఉంది.

# పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి..

- ప్రతి ఎకరానికి సాగు నీరు అందేలా ప్రాజెక్టుల పూర్తి....
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగు నీరు అందే ప్రాజెక్టు చేపట్టాలి*
- సన్న రకం ధాన్యం రూ.2800 కంటే తక్కువ ధరకు ప్రైవేట్ లో అమ్మకుండా చర్యలు*
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తికరం..
- 10 నెలల కాలంలో 50 వేల పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం*
- లక్ష మందితో డిసెంబర్ 4 న పెద్దపల్లి లో సి.ఎం బహిరంగ సభ*
- రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి...
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి ఉత్తమ్*

వారధి న్యూస్ ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి



ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఆదివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు,బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రోటోకాల్ ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగం పై ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ హెలిపాడ్ వద్దకు చేరుకున్న మంత్రుల బృందానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పుష్ప గుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికారు.ధాన్యం కొనుగోలు పై అధికారుల తీసుకోవాల్సిన చర్యల గురించి పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనులు, కాళేశ్వరం ప్యాకేజ్ 9 పెండింగ్, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, రామగుండం ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజ్ 2 పనులు, ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తదితర అంశాల పై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు

***మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ**

స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మన రైతులు పండించారని మంత్రి తెలిపారు.గతంలో ఎక్కడా లేని విధంగా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని అన్నారు. రైతులకు ఎక్కడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు రికార్డు సమయంలో వడ్ల డబ్బులు పడ్తున్నాయని అన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తి కరంగా ఉందని అన్నారు.డిసెంబర్ 4న సీఎం పర్యటన ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులు/ఇంటర్మీడియట్ గోదాములకు తరలించాలని, వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తే గంటల వ్యవధిలో రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించడం జరుగుతుందని అన్నారు.ముఖ్యమంత్రి పర్యటన సమయానికి 100% ధాన్యం డబ్బులు చెల్లించి ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు.సన్న రకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికంగా కొనుగోలు చేయాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడ రూ. 2800 కంటే తక్కువ ధరతో సన్న రకం ధాన్యం కొనుగోలు చేయకుండా చూడాలని అన్నారు.రాబోయే సంవత్సరంలో రేషన్ లో సన్న బియ్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా కనీసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. తక్కువ ఖర్చుతో రైతులకు సాగు నీరు అందించే పనులు ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి ఉత్తమ్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.సమృద్ధిగా నీరు అందుబాటులో ఉంటూ,కాస్ట్ బెనిఫిట్ నిష్పత్తి సానుకూలంగా ఉన్న పనులను సంబంధిత ఎమ్మెల్యేలతో కలిసి సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు.రోళ్ళ వాగు ప్రాజెక్టు సంబంధించి అటవీ భూముల సేకరణ ప్రక్రియ నీటి పారుదల శాఖ భూ సేకరణ, ఆర్ & ఆర్ కోసం ప్రత్యేకంగా కేటాయించిన అధికారితో సమన్వయం చేస్తూ పూర్తి చేయాలని అన్నారు.రోళ్ళ వాగు పై క్షేత్రస్థాయి నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు.మన రాష్ట్రంలో ప్రస్తుత ప్రాజెక్టులలో సాగు నీరు ఎంత ఉంది, యాసంగి పంటకు ఎంత విడుదల చేస్తాం అనే అంశంపై సమగ్ర ప్రణాళిక తయారు చేసి రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అన్నారు.గౌరవెల్లి ప్రాజెక్టు సంబంధించి భూ సేకరణ కోసం అవసరమైన నిధులు వెంటనే విడుదల చేస్తామని, గౌరవెల్లి కాల్వ పనులు త్వరగా చేపట్టేలా స్థానిక రైతులతో మాట్లాడి కోర్టు కేసు విత్ డ్రా చేయించాలని మంత్రి ప్రజాప్రతినిధులను కోరారు.పత్తిపాక రిజర్వాయర్ రూ.2950 కోట్లు 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులు కాల్వల ఆపరేషన్, నిర్వహణ కు నిధులు కేటాయించలేదని, ప్రస్తుతం కాల్వల మరమ్మత్తు పనులు అవసరమైన చేపట్టి పూర్తి చేస్తామని అన్నారు.రామగుండం ఎత్తిపోతల పథకం 95 శాతం పూర్తయిందని, డిసెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు సాగు నీరు అందించాలని మంత్రి సూచించారు. **మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,**

సన్న వడ్లకు రూ. 500 బోనస్ ప్రకటించడంతో రైతులకు అధికంగా లాభం చేకూరుతుందని అన్నారు. రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాధాన్యతను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రూ. 2 లక్షల రుణమాఫీ, సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ పథకాల లబ్ధి పొందుతున్న రైతులతో వీడియోలు చేసి ప్రచారం చేయాలని ,గ్రామాలలో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.చిన్న కాళేశ్వరం ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం గత 10 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. దేవాదుల ప్రాజెక్టుగా సంబంధించి మరిన్ని అవుట్ లెట్ నిర్మాణం చేయాలని అన్నారు.పత్తిపాక రిజర్వాయర్ నిర్మించడం వల్ల 2.4 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా మరో 15 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని అన్నారు.వరదల సమయంలో మరమ్మత్తుకు గురైన చెరువులను బాగు చేయాలని, జిల్లాలో ఉన్న చిన్న లిఫ్టుల నిర్వహణ నిధులు మంజూరు చేయాలని మంత్రి తెలిపారు. పోతారం ఎత్తిపోతలకు పథకం, భీం ఘనపూర్ ఎత్తిపోతల పథకం పనుల ప్రతిపాదనలు అందజేయాలని అన్నారు.

***మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా జరుగుతుందని అన్నారు.రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వ పాలసీ అనుసరిస్తూ సహకారం అందిస్తున్నారని అన్నారు. జిల్లాలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్ ను కలెక్టర్, ఉన్నతాధికారులు రెగ్యులర్ గా తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని అన్నారు.మెస్ చార్జీల బిల్లులను గ్రీన్ చానేళ్ళ ద్వారా సరఫరా చేస్తామని అన్నారు.గౌరవెల్లి గండేపల్లి ప్రాజెక్టులను లింక్ చేసి సమాంతరంగా నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి బండ్ నిర్మాణం చివరి దశలో ఉందని, కాలువల పనులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని, భూ సేకరణ పై ఎటువంటి కోర్టు నిబంధనల లేనందున ముందుగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్యాకేజీ 9 పనులు, మలక్ పేట రిజర్వాయర్ కాలువ,అప్పర్ మానేరు పనులు ప్రాధాన్యత అందించాలని కోరారు. అనంతరం మంత్రుల బృందం సీఎం రేవంత్ రెడ్డి డిసెంబర్ 4 న పాల్గొనే యువ శక్తి సభా స్థలిని పరిశీలించారు.



# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలమైన ఉత్పత్తి వాగ్దానాలే

- **ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్.**

వారధి న్యూస్, హైదరాబాద్ :

బీజేపీ పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ లో 6గ్యారెంటీలు, 66 మోసాల పై చార్జ్ షీట్ పేరిట ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన శ్యామ్ సుందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పాలనలో తేడా ఏమీ లేదని దొందు దొందేనని తెలిపారు. మొదటి గ్యారెంటీ మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పించినట్లు ప్రభుత్వం చెప్పుకుంటుందని కానీ ఆ బస్ లలో ప్రయాణించిన వారి పరిస్తితి ఎలా ఉందనేది మనకు తెలిసిందేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అవినీతికి, అక్రమాలకు మారు పేరని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర నాయకత్వానికి డబ్బులు పంపించడానికే హైడ్రా ను తీసుకు వచ్చిందని అన్నారు. కేవలం ఒక్క సంవత్సరంలోనే ఇంత వ్యతిరేకత ఎదుర్కొంటున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని వెల్లడించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన గుణపాఠం చెప్పడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగేదాకా బిజెపి విశ్రమించేది లేదని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండడమే కాకుండా వారికి బాసటగా బిజెపి అండగా నిలుస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పార్లమెంటు కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు.ఈ ఆరు గ్యారంటీలు అబద్ధాలేనని , ఇప్పటికే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం 66 మోసాలు చేసిందని మేకల సారంగపాణి అన్నారు . ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శిలు పెద్ది రవీందర్, సీకే శంకర్రావు, కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, వంశ తిలక్, కార్పొరేటర్ చీరాల సుచిత్ర కన్వీనర్లు నాగేశ్వర్ రెడ్డి, రమేష్ రామ్, శ్రీశైలం గౌడ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు, రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, ఆకారం రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాజు, అంబాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పదవి విరమణ కార్యక్రమం.

వారధిన్యూస్_ఆత్మకూర్.

,ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఏఎస్ఐగా విధులు నిర్వహించిన బీచుపల్లి నిన్న పదవి విరమణ పొందడంతో ఈరోజు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డిఎస్పి వెంకటేశ్వర్ రావు హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు వృత్తి అనేది చాలా ధైర్య సాహసాలతో కూడుకున్న ప్రతి అని తెలిపారు పదవి విరమణ పొందిన బీచుపల్లి పది మిస్సింగ్ కేసులు చేదించారని, రెండుసార్లు ఉత్తమ పోలీస్ అవార్డులు తీసుకున్నారని ఆయన తెలిపారు. ఇతను మొదట 1988లో పోలీసు వృత్తిలోకి రావడం జరిగిందని విధి నిర్వహణలో ఎన్నో ఆటు, పోట్లు తట్టుకుని సమర్థవంతంగా విధులు నిర్వహించారని ఆయన తెలిపారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు 2017 నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ ,ఎస్ఐ సురేందర్, పోలీసు సిబ్బంది, మండలంలోని వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు ,తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా సీనియర్ బాలికల కబడ్డీ జట్టు ఎంపిక

వారధి న్యూస్ _ఆత్మకూర్.,

ఆదివారం వనపర్తి జిల్లా సీనియర్ బాలికల జట్టును ఎంపిక ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు ఎంపికలు జరిగినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో మొత్తం 55 క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన అటువంటి 12 మంది బాలికలను రాష్ట్రస్థాయికి వనపర్తి జిల్లా జట్టు తరపున ఎంపిక చేశారు. ఆదివారం నాడు బాలుర కళాశాల మైదానంలో ఏ ఎంపికలు జరిగినాయి ఇందులో ఎంపికైనటువంటి క్రీడాకారిణులు లక్ష్మి. అనూష, చిట్టెమ్మ, శాంతమ్మ, శ్రీవాణి, తులసి, పద్మ, వెన్నెల, శిరీష, నిర్మల, హారిక, ప్రవళిక, మానస, లక్ష్మి. జిల్లా జట్టుకు ఎంపికయ్యారని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం కురుమయ్య , డి వై ఎస్ ఓ సుధీర్ కుమార్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ జి సురేందర్ రెడ్డి, కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు జేఏసీ వేణుగోపాల్, వెంకట్ రాములు, బాబుజి.పిడి, పీఈటీలు నిరంజన్ గౌడు, మధు, అంజి, ఝాన్సీ, శివాని, త్రివేణి, మహేష్, లక్ష్మణ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

# ఏజెన్సీ ఎస్సీలకు హక్కులు కల్పించాలి

- **రైతు క్షేమమే - దేశ క్షేమం....**
- **అన్నం పెట్టే రైతన్నలను ఆదుకోవాలి....**
- **సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్....**

వారధి న్యూస్, గోదావరిఖని :

తాతల తండ్రుల కాలం నుండి ఏజెన్సీ 5వ. షెడ్యూల్డు ప్రాంతాల్లో ఎస్టీలతో మమేకమై నివసిస్తున్న ఎస్సీలకు ఏజెన్సీ పై హక్కులు కల్పించాలని నగేష్ అన్నారు. వారు సాగు చేసుకుంటున్న పోడు భూములకు, సాగుభూములకు హక్కు పత్రాలు ఇప్పించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం నగేష్ కోరారు.

ఆదివారం తెలంగాణ రైతు సంక్షేమ సమితి చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సూర్య కిరణ్ అధ్యక్షతన నిర్వహించిన రైతు సంక్షేమ సమితి 5వ. వార్షికోత్సవ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు.

రైతు లేనిదే రాజ్యం లేదు, రైతు క్షేమమే దేశ క్షేమం, పాలకుల నిర్లక్ష్యం వల్ల దేశానికి అన్నం పెట్టే రైతన్న జీవితాలు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని, అన్నదాతలను ఆదుకోవాలని, అనే తలంపుతో తెలంగాణ రైతు సంక్షేమ సమితి సంఘాన్ని స్థాపించి, రైతులకు అండగా ఉంటూ, రైతుల సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేస్తూ ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు తమ వంతు సహాయం అందిస్తున్న జస్టిస్ చంద్రకుమార్ ని అభినందించారు.

ఈ సందర్భంగా ఏజెన్సీ దళితుల సమస్యలు వివరించారు. ఏజెన్సీ 5వ. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసిస్తున్న దళితులకు పుట్టిన భూమిపై హక్కులు లేక, రాజకీయ రిజర్వేషన్ లేక, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రాజకీయంగా, ఆర్థికంగా,సామాజికంగా అభివృద్ధికి నోచుకోక దయ పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన చెందారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14,19,21 ద్వారా దేశంలో పుట్టిన ప్రతి పౌరునికి జీవించే అవకాశం కల్పించిందని , వారికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, విద్య, వైద్యం మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించాలని రాజ్యాంగం చెబుతోందని తెలిపారు. ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది పాలకులు మారుతున్న కూడా వారి జీవన పరిస్థితి మారడం లేదని గుర్తు చేశారు. జస్టిస్ చంద్రకుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతు సంక్షేమ సమితి అండగా నిలవాలని వారికి ప్రత్యామ్యాయం చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న, కవి రచయిత ఏలేశ్వరం వెంకటేష్ , సామాజిక ఉద్యమకారులు ఉమా మహేశ్వర రావు, ఎరుకల రాజన్న, దుర్గం లింగయ్య, రాష్ట్రంలోని వివిధ ప్రజా సంఘాల నాయకులు, వివిధ జిల్లాల ప్రజా సంఘాల నాయకులు, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# ఎన్టిపిసి లోని యాక్సిస్ బ్యాంక్ ఎటిఎం లో గుర్తుతెలియని దొంగలు

- **ఏటీఎం ను పగలగొట్టి చోరీకి విఫల యత్నం...**

వారధి న్యూస్ , గోదావరిఖని :

మంగళవారం 26 నవంబర్ న. రాత్రి తెల్లవారుజామున ఎన్టిపిసి లోని యాక్సిస్ బ్యాంక్ ఎటిఎం లో గుర్తుతెలియని దొంగలు ఏటీఎం ను పగలగొట్టి, చోరీకి విఫల యత్నం చేసిన విషయమై బ్యాంక్ మేనేజర్ గుంటుక. రణధీర్ ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకునీ విచారణ చేపట్టారు . తదుపరి ఎన్టిపిసి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన టి.ఉదయ్ కిరణ్ , గోదావరిఖని ఏసీపి ఎం.రమేష్ సూచనల మేరకు, రామగుండం సిఐ టి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో.. నిందితులు తుమ్మల మధు తండ్రి పేరు రమేష్ నివాసం నందిగామ కృష్ణా జిల్లా ఆంధ్ర ప్రదేశ్, బండ్ల అబ్రహం తండ్రి పేరు జ్ఞానం నివాసం నందిగామ కృష్ణా జిల్లా ఆంధ్ర ప్రదేశ్ లను, అత్యంత చాకచక్యంగా పట్టుకుని వారి వద్ద నుండి నేరం చేయుటకు ఉపయోగించిన లారీ, ఇనుప సుత్తి, జర్కిన్స్, మంకీ క్యాప్ లు, మాస్కులు , బ్లౌజులు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టు నందు హాజరుపరిచారు . నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లు టి.అంజయ్య జె.శ్రీనులను, సిఐ అభినందించారు.



# ఉచితంగా 2 వ డయబెటిస్ పరీక్షలు..

వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి

జగిత్యాల పట్టణంలో శ్రీ కోదండ రామాలయం వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవరణలో వాకర్ సభ్యులు ఆదివారం 130 మందికి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు.షుగర్ తో బాధపడుతున్న వారికి పాటించవలసిన ఆహారపు అలవాట్ల పాంప్లెంట్స్ ఇవ్వడంతో పాటు కొత్తగా షుగర్ ఉన్నట్లు గుర్తించబడ్డ వారిని ఫాలో అప్ టెస్ట్ ల కొరకు హాస్పిటల్ కి పంపించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల లయన్స్ క్లబ్ అఫ్ అధ్యక్షులు తాటిపాముల వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ల శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్,చార్టర్ ప్రెసిడెంట్ శ్రీరాముల సుదర్శన్, ఉపాధ్యక్షులు ఐల్నేని వెంకటేశ్వరరావు, మానపురి శ్రీనివాస్, కట్ల శ్రీనివాస్, తంగెళ్ల రమేష్, గాలిపెల్లి నర్సయ్య, సామల శ్రీహరి,కాసారపు లక్ష్మీనారాయణ గౌడ్, లయన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు...

వారధి న్యూస్ ,గొల్లపెల్లి/జగిత్యాల ప్రతినిధి

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం నెహ్రూ యువ కేంద్రం, ఫ్రెంచ్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఇందులోభాగంగా కబడ్డీ ప్రథమ బహుమతి రాపల్లి, ద్వితీయ బహుమతి దట్నూర్ గ్రామాల వారు దక్కించుకున్నారు. వాలీబాల్ పోటీలో ప్రథమ బహుమతి గొల్లపల్లి ,ద్వితీయ బహుమతి మల్లన్నపేట్ వారు విజేతలుగా నిలిచారు.పరుగు పందెం పోటీలో మనోహర్, మన్మోహన్, సాయి విజయం సాధించారు.బిజెపి గొల్లపల్లి మండల అధ్యక్షులు కట్ట మహేష్, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పోలవేణి భూమేష్,బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడ పోటీలు ప్రారంభించగా అతిథులచే విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ వాలీబాల్ సీనియర్ ప్లేయర్స్ మండల జగన్,చిన్నాడి రాజసింహారావు పీఇటీలు గా అంకం శేఖర్,రవితేజ లు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమంలో అమరుడు భూక్యా ప్రవీణ్ నాయక్ పోరాటం మరువలేనిది

- **లంబాడీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రవీణ్ నాయక్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి**
- **రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త గుగులోత్ రమేష్ నాయక్,నియోజక వర్గ ఇన్చార్జి భూక్యా ప్రవీణ్ నాయక్.**


వారధి న్యూస్, మహబూబాబాద్ ప్రతినిధి:

మలి దశ ఉద్యమంలో భాగంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనతోనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని, మా నీళ్ళు, మా నిధులు మాకే కావాలని కోటి ఆశలతో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నడుం బిగించి దీక్షలు ధర్నాలు రాస్తారోకోలు లాంటి ఎన్నో కార్యక్రమాలలో పాల్గొని అసువులు బాసిన భూక్య ప్రవీణ్ నాయక్ త్యాగాన్ని గుర్తుచేసుకోవాలని రాష్ట్ర సమన్వయ కర్త గుగులోత్ రమేష్ నాయక్ అన్నారు,ఆయన వర్ధంతి సందర్భంగా లంబాడీల ఐక్యవేదిక డోర్నకర్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జి బాణోత్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో మరిపెడ మండల కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ గుగులోత్ ప్రవీణ్ నాయక్, మండల కోఆర్డినేటర్ గుగులోత్ దేవేందర్ నాయక్, మండల ఇంఛార్జి దేవేందర్ నాయక్, జిల్లా విద్యార్థి విభాగం జిల్లా కో ఆర్డినేటర్ గుగులోత్ బాసు నాయక్, మండల జాయింట్ సెక్రెటరీ ధరావత్ రాజేష్‌నాయక్ నాయక్, మండల స్టూడెంట్ వింగ్ కోఆర్డినేటర్ వెంకటేష్‌నాయక్, గ్రామ స్టూడెంట్ వింగ్ కోఆర్డినేటర్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు...*

# వరకట్న వేధింపులకు ఆత్మహత్యకు గురైన దీప్తి....

వారధి న్యూస్ ,గోదావరిఖని

ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉండే దీప్తి 28 సంవత్సరాల యువతి, 2021 సంవత్సరంలో ఆటోనగర్ ఎన్టిపిసికి చెందిన అహర్వార్ నరేందరు ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి ఒక కొడుకు ఉన్నారు. గత కొన్ని రోజులుగా దీప్తిని ఆమె భర్త నరేందర్ ఏ పని చేయకుండా తాగి వచ్చి 20 లక్షలు కట్నం తీసుకురమ్మని శారీరకంగా, మానసికంగా వేధింపులు భరించలేక, శనివారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కి ఉరి వేసుకొని చనిపోయింది. మృతురాలి తండ్రి దేవరకొండ దివాకర్ ఫిర్యాదు మేరకు, ఎన్టిపిసి ఎస్ఐ ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకున్నారు.గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్ తదుపరి విచారణ చేపట్టారు.



విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

Movie Time మూవీ టైమ్



## మృణాల్‌లో ఇన్ని షేడ్స్...?

ెచ్చిపెడుతోన్న మాధ్యమం ఇది. ఇక్కడ రాణించాలంటే? కేవలం సినిమా హీరోయిన్ మాత్రమే అవ్వాల్సిన పనిలేదు. లక్షల మంది ఫాలోవర్లు ఉంటే చాలు సెలబ్రిటీ హోదా దక్కినట్లే. ఇక నిజమైన సెలబ్రిటీల సంగతి వేరేలా ఉంటుందనుకోండి. తాజాగా మృణాల్ ఠాకూర్ అలియాస్ సీతమ్మ తనలో కొత్త యాంగిల్ ని ఒక్కొక్కటిగా బయటకు తీస్తుంది. ఇదిగో ఇక్కడిలా ముఖంపై రకరకాల ఎక్స్ ప్రెషన్ తో ఓ షో రిలీజ్ చేసింది. ఇందులో మృణాల్ ఒకరకంగా కాదు..రకరకాల ఎక్స్ ప్రెషన్ తో అదరగొట్టింది. చెవులకు హెడ్ పోన్స్ పెట్టుకుని అక్కడ సిచ్వేషన్ కి తగ్గట్టు అమ్మడు ముఖంలో హవభావాలు మారుస్తుంది. సంతోషం, దుఖం, విచారం. సందిగ్దత ఇలా సన్నివేశానికి తగ్గట్టు ఎక్స్ ప్రెషన్స్ ఇచ్చింది. దానికి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు తమదైన శైలిలో పోస్టులు పెడుతున్నారు. ఇక సీతమ్మ కెరీర్ ఇప్పడు జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్, బాలీవుడ్ లో వరుసగా అవకాశాలు అందుకుంటుంది. ఇంకా చెప్పాలంటే టాలీవుడ్ ని మించి బాలీవుడ్ లో రెట్టించిన పారితోషికంతో అవకాశాలు ఒడిసి పట్టుకుంటుంది. ఇప్పటికే 'పూజా మేరీజాన్' షూటింగ్ పూర్తి చేసింది. అలాగే 'హైజవానీ హై తో ఇష్క్ హోనా హై' అనే మరో సినిమా షూటింగ్ లో పాల్గొంటుంది. ఈ సినిమాలతో పాటు కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్న చిత్రంలోనే మృణాల్ అవకాశం అందుకుంది. ఇందులో సిద్దాంత్ చతుర్వేది హీరోగా నటిస్తున్నారు. రవి ఉద్యవార్ తెరకెక్కిస్తున్నాడు. ఇదొక రొమాంటిక్ ఎంటర్ టైనర్. 'ఆషీకీ -2' తరహాలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. మ్యూజికల్ లవ్ స్టోరీగా హైలైట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమాకి 'తుమ్ హీ హో 'అనే టైటిల్ ఖరారు చేసారు.



## "పుష్ప 2' ది రూల్ నుండి 'పీలింగ్స్' సాంగ్

క్రియేటివ్ జీనియస్ సుకుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ పతాకంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం పుష్ప 2. 2021లో విడుదల అయిన పుష్ప 1 చిత్రానికి సీక్వెల్ గా ఈ చిత్రం డిసెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సునీల్, ఫహాద్ ఫాసిల్, జగపతి బాబు, రావు రమేష్, అనసూయ భరద్వాజ్, ధనుంజయ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రానికి నవీన్ ఎర్నేని, రవిశంకర్ యెలమంచిలి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం నుండి నేడు పీలింగ్స్ సాంగ్ విడుదల కావడం జరిగింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించినా ఈ పాటకు చంద్ర బోస్ లిరిక్స్ రాయగా శంకర్ బాబు కందుకూరి, లక్ష్మి దాస తమ స్వరాన్ని జోడించి ఈ పాటను పాడడం జరిగింది. ఈ లిరికల్ సాంగ్ చూస్తుంటే అల్లు అర్జున్, రష్మిక మందన్నతో కలిసి ఎంతో ఎనర్జిటిక్ గా డాన్స్ స్టెప్పులు వేసినట్లు తెలుస్తుంది. ఈ పాటలో వింటేజ్ అల్లు అర్జును చూస్తారు, మలయాళం లిరిక్స్ తో మొదలై ఆ తర్వాత తెలుగు లిరిక్స్ తో కొనసాగుతుంది. "ఇప్పటికే ఈ చిత్రం నుండి మూడు పాటలు విడుదల కాగా అన్ని పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మరోసారి ఈ సాంగ్ తో చిత్ర బృందం ప్రేక్షకులను అలరించనుంది.



## ముఫాసా: ది లయన్ కింగ్' సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది

నమ్రత

మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20, 2024న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం 2019లో లైవ్-యాక్షన్ ది లయన్ కింగ్ బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులని అలరించబోతోంది. 'ముఫాసా'కి సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఇస్తున్నారు. మహేష్ బాబు వాయిస్ ఓవర్ లో రిలీజైన ట్రైలర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తూ సూపర్ స్టార్ మహేష్ బాబు అద్భుతమైన పోస్టర్‌ను నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని గ్రాండ్ మీడియా ఈవెంట్ లో లాంచ్ చేశారు. టాకా పాత్రకు వాయిస్ హీరో సత్యదేవ్, టిమోన్ పాత్ర వాయిస్ ఇచ్చిన అలీ ఈ వేడుకలో పాల్గొన్నారు. పుంబా పాత్రకు బ్రహ్మానందం, కిరోస్ పాత్రకు అయ్యప్ప పి శర్మ వాయిస్ అందించారు. ప్రెస్ మీట్ లో నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని మాట్లాడుతూ.. డిస్నీ టీంకి థాంక్ యూ. చాలా శ్రద్ధతో ఈ ప్రాజెక్ట్ ని చేశారు. ఇలాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ ని డబ్ చేయడం ఒక ఛాలెంజ్, డిస్నీ టీం చాలా ఎఫర్ట్ పెట్టి అద్భుతంగా తెలుగు ఆడియన్స్ ముందుకు తీసుకొస్తున్నారు. ఇది ఫ్యామిలీ ఫిల్మ్. ఎమోషనల్ రైడ్. మహేష్ బాబు గారు చాలా ఎంజాయ్ చేస్తూ డబ్బింగ్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చింది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనే నమ్మకం వుంది'అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. మన వాయిస్ డిస్నీ లైబ్రరీలో వుండడం అనేది గ్రేట్ ఎచీవ్మెంట్. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిన్న క్యారెక్టర్ చేశాను. ఓ సీన్ లో మహేష్ గారు నాభుజంపై చెయ్యి వేస్తూ మాట్లాడతారు. అప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. తర్వాత సరిలేరు నికెవ్వరు లో ఒక క్యారెక్టర్ చేశాను. ఇప్పుడు ఆయనతో కలసి టాకా అనే క్యారెక్టర్ కి వాయిస్ చెప్పడం చాలా ఆనందంగా వుంది. ఈ సినిమాకి డబ్బింగ్ చెప్పిన తర్వాత ఆ ఎమోషన్ లో వుండటం వలన యానిమల్స్ ని చూస్తే తమ్ముడు అన్న అనే ఫీలింగ్ కలిగేది(నవ్వుతూ). ముఫాసా అంత ఇంపాక్ట్ క్రియేట్ చేసింది.మహేష్ గారి పంచస్ అద్భుతంగా పేలాయి. సినిమాని చాలా ఎంజాయ్ చేస్తారు' అన్నారు.